# రజతోత్సవ సభ..తెలంగాణకు పండుగ

- రజతోత్సవసభకు భారీగా వచ్చేందుకు కార్యకర్తలు సిద్ధం
- ఖైరతాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్ మన్నె కవిత



వరంగల్ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి , కార్పొరేటర్ కవిత

బంజారాహిల్స్,ఏప్రిల్ 24: బీఆర్‌ఎస్ రజతోత్సవం సందర్భంగా నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి అన్నారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని తన కార్యాలయంలో గురువారం వెంకటేశ్వరకాలనీ డివిజన్‌కు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్ కవితారెడ్డితో కలిసి మన్నె గోవర్ధన్‌రెడ్డి సభకు వస్తున్నవారికి సౌకర్యాలతో పాటు బస్సుల కేటాయింపు తదితర అంశాలపై చర్చించారు. వరంగల్ సభకు స్వచ్ఛందంగా వస్తామంటూ ఎంతో మంది కార్యకర్తలు చెబుతున్నారని, పార్టీ ఏర్పాటు చేసిన బస్సులతో పాటు సొంత వాహనాల్లో వారంతా సభకు వస్తామని చెబుతున్నారన్నారని వివరించారు. ఉద్యమ సారథి కేసీఆర్‌కు ఖైరతాబాద్ నియోజకవర్గంతో ప్రత్యేకమైన అనుబంధం ఉందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత పర్యటనలకు బయలుదేరినప్పుడు ఉద్యమనేత కేసీఆర్ తొలి జెండా నందినగర్‌లోనే ఎగురవేశారన్నారు. ఆరోజు నుంచి ఈ రోజుదాకా గులాబీ జెండా మోస్తున్న అనేకమంది కార్యకర్తలు ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉన్నారన్నారు. రజతోత్సవ సభ తెలంగాణ మొత్తానికి పండుగ లాంటిదని, ఈ పండుగను వైభవంగా చేసుకుందామని కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు రాంచందర్, సారంగపాణి, షేక్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.




### బీఆర్‌ఎస్ గద్దెలకు కొత్త సొబగులు

వరంగల్‌లో ఈ నెల 27 జరుగనున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ నేపథ్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. హైదరాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్ పర్సన్ కె. ప్రసన్న ఆధ్వర్యంలో సోమాజిగూడ రాజ్‌భవన్ రోడ్‌లో కారును పోలిన జెండా గద్దె ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. – ఖైరతాబాద్

## పాత పద్ధతిలోనే టెండర్ల ప్రక్రియను కొనసాగించాలి

హిమాయత్‌నగర్,ఏప్రిల్ 24: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కొనసాగించిన పద్ధతిలోనే టెండర్ల ప్రక్రియను యధావిధిగా కొనసాగించాలని తెలంగాణ ఫౌల్ట్రీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టెండర్ ప్రక్రియలో జరిగే అవకతవకల విషయాన్ని తాము సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారని తెలిపారు. టెండర్ ప్రక్రియను సమీక్షించాలని అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం బషీర్‌బాగ్‌లోని ఫెడరేషన్ కార్యాలయం వద్ద ఐదువేల గుడ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ పథకంకు కోడి గుడ్ల టెండర్లను కొంతకాలంగా మూడు కుటుంబాలు మాత్రమే దక్కించు కోవడంతో 7500 మంది ఫౌల్ట్రీ రైతులు నష్ట పోతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఏడు జోన్లుగా విభజించి టెండర్ ప్రక్రియను జరుపుతున్నారని, నిబంధనలను సైతం విస్మరించి కొంతమంది అధికారులు వారికి అనుకూలంగా ఉన్న వారికి టెండర్లు వచ్చేలా కుట్రలు పన్నుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పల నర సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఉడుతల భాస్కర్ రావు , కార్యదర్శి పాతూరి వెంకట్ రావు, కోశాధికారి అభిషేక్‌రెడ్డి పాల్గొన్నారు.



## కుస్తీలో బాలిక సత్తా

జాతీయ స్థాయి కుస్తీ పోటీలలో ఎర్రగడ్డ కు చెందిన పూజ నిత్లేకర్ సత్తా చాటింది. రెజ్లింగ్ అండర్ –17 బాలికల 46 కేజీల విభాగంలో పసిడితో మెరిసింది. ఢిల్లీలో ఈనెల 21 నుంచి 26 వరకు జరుగుతున్న 68 వ నేషనల్ స్కూల్ గేమ్స్ లో యూసుఫ్‌గూడ చెక్‌పోస్ట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఈ బాలిక జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ ప్రదర్శించింది. ఈ సందర్భంగా కోచ్, తన తండ్రి చంద్రకాంత్ ఖళీఫా రతన్ సింగ్ ఉస్థాద్ పూజను అభినందించారు.

– జూబ్లీహిల్స్,ఏప్రిల్ 24:


అత్తాపూర్‌లో బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను అతికిస్తున్న అత్తాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అప్పారెడ్డి ముఖేష్

### చరిత్రలో నిలిచిపోయేలా
## రజతోత్సవ సభ

మైలార్‌దేవ్‌పల్లి, ఏప్రిల్ 24: వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభ చరిత్రలో నిలిచిపోతుందని అత్తాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అప్పారెడ్డి ముఖేష్ అన్నారు. బహిరంగ సభ సందర్భంగా వాల్‌రైటింగ్, బీఆర్‌ఎస్ దిమ్మెలకు రంగులు వేయడం తదితర కార్యక్రమాలను చేపడుతున్నారు. ఈ సందర్భంగా అప్పారెడ్డి ముఖేష్ మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద ప్రాంతీయ పార్టీగా బీఆర్‌ఎస్ ఎదిగిందని, లక్షల మంది పార్టీ కార్యకర్తలు పార్టీకి అండగా ఉన్నారన్నారు.

1200 ఎకరాలలో నిర్వహించే బీఆర్‌ఎస్ బహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలివెళ్లి కేసీఆర్‌కు అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాశం నరేందర్‌రెడ్డి, పుప్పాల లక్ష్మణ్, మల్లేష్‌యాదవ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్ జెండా దిమ్మెకు రంగులు వేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

## అనుమతి మూడు..నిర్మించింది ఆరు

### బంజారాహిల్స్‌లో అక్రమ నిర్మాణం కూల్చివేత


బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 11లో 200 గజాల స్థలంలో అక్రమంగా నిర్మించిన ఆరు అంతస్తుల భవనం

బంజారాహిల్స్,ఏప్రిల్ 24: మూడు ఫ్లోర్లకు అనుమతి తీసుకుని 200గజాల స్థలంలో ఏకంగా ఆరంతస్తుల భారీ భవనాన్ని నిర్మించిన వ్యక్తిపై జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం చర్యలు ప్రారంభించింది. వివరాల్లోకి వెళ్తే.. జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 పరిధిలోని బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 11లో సర్వీ హోటల్‌కు సమీపంలో దీపక్‌కుమార్ గుప్తా అనే వ్యాపారి 200గజాల స్థలంలో భవన నిర్మాణం చేపట్టారు. జీహెచ్‌ఎంసీనుంచి సిల్ట్ ప్లస్ 2 ఫ్లోర్లకు అనుమతి తీసుకున్న దీపక్‌కుమార్ గుప్తా బ్లూషీట్లు వేసుకుని ఏకంగా ఆరు అంతస్తులు నిర్మించాడు. సుమారు ఏడాదికాలంగా నిర్మాణపనులు కొనసాగుతున్నా స్థానిక టౌన్‌ప్లానింగ్ అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదు. దీంతో స్థానికులు అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలంటూ పలుమార్లు జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. దీంతో దీపక్‌గుప్తాకు నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో పాటు తనకు అధికార పార్టీలోని ప్రజాప్రతినిధులతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, తనజోలికొస్తే ఇబ్బందులు ఎదుర్కొంటారంటూ హెచ్చరికలు జారీ చేశారు. దీంతో స్థానికులు జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేసి కూల్చివేతలు చేయాలని ఆదేశించారు. దీంతో నెలరోజుల క్రితం సర్కిల్–18 డీఎంసీ ప్రశాంతి వెంటనే అక్రమ నిర్మాణాలు తొలగించాలని స్పీకింగ్ ఆర్డర్ జారీ చేశారు. అయితే జీహెచ్‌ఎంసీ ఆదేశాలు పట్టించుకోకపోవడంతో గురువారం సర్కిల్ –18 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అనుమతి లేకుండా నిర్మించిన అదనపు అంతస్తులు పాక్షికంగా కూల్చివేశారు.


కూల్చివేస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది



### ఎట్టకేలకు మట్టిదిబ్బలు
## తొలగింపు

బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 10లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి నుంచి బ్రహ్మకుమారీస్ రోడ్డుపై సుమారు నెలరోజులుగా పేరుకుపోయిన చెత్తాచెదారంతో పాటు మట్టిదిబ్బలను జీహెచ్‌ఎంసీ సిబ్బంది గురువారం తొలగించారు. పారిశుద్ధ్య విభాగం, ఇంజినీరింగ్ విభాగం మధ్యన సమన్వయలేమితో రోడ్డు కోసం తవ్విన మట్టిని కాంట్రాక్టర్ రోడ్డుమీద వేయగా, దానిమీద స్థానికులు చెత్తాచెదారాన్ని పారబోశారు.

ఈ వ్యవహారంపై నమస్తే తెలంగాణ కథనాలతో గురువారం జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం స్పందించి మట్టిదిబ్బలను తొలగించారు.

– బంజారాహిల్స్,ఏప్రిల్ 24:

## తిరుమలహిల్స్‌లో సమస్యలు పరిష్కరించాలి


మణికొండ మున్సిపాలిటీ తిరుమలహిల్స్‌లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు

మణికొండ, ఏప్రిల్ 24: మణికొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ప్రతిరోజూ పాదయాత్రలు నిర్వహిస్తున్నామని మణికొండ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ అన్నారు. గుడ్ మార్నింగ్ మణికొండ పేరిట ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో భాగంగా గురువారం తిరుమల హిల్స్‌లోని రోడ్ నెంబర్ 1,2,3లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.

రోడ్డు నెంబర్ 2లో దాదాపు రెండు మూడు సంవత్సరాల క్రితం రోడ్డును తవ్వి తిరిగి రోడ్డుని నిర్మించలేదన్నారు. ఈ విషయం పలుమార్లు మున్సిపల్ అధికారుల దష్టికి తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. రోడ్డు నెంబర్ 2 దగ్గర డ్రైనేజీ వ్యవస్థను అభివద్ధి చేయాలన్నారు. ఎలక్ట్రిక్ స్తంభం ఒక వైపు వంగడం వలన వైర్లు పూర్తిగా కిందకి వేలాడుతున్నాయన్నారు. దీని కారణంగా ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. రోడ్డు నెంబర్ 2,3 మధ్యలో ఉన్న ఖాళీ స్థలంలో చెత్తాచెదారం వేస్తున్న కారణంగా తరచు పాములు వస్తున్నాయన్నారు.

తిరుమలహిల్స్ కాలనీ మొత్తంగా హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వారు ప్లాన్ మంజూరు చేసినప్పటికీ కాలనీలో రోడ్డు కుదించుకుపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో గుట్టమీది నరేందర్, అందె లక్ష్మణ్‌రావు, బుద్దోలు బాబు, ఉపేంద్రనాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌చారి, సంఘం శ్రీకాంత్, కిరణ్‌యాలాల, చెరుకూరి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



### పంజాగుట్ట ట్రాఫిక్ పీఎస్‌లో ..ఉచిత వైద్య శిబిరం

ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ, యూరాలజీ, మ్యాక్స్ విజయ్ కంటి దవాఖాన సంయుక్తాధ్వర్యంలో గురువారం పంజాగుట్ట ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని అదనపు డీసీపీ వేణుగోపాల్ రెడ్డి, ఏసీపీ హరిప్రసాద్, సీఐ బోస్ కిరణ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులను సూచించారు.

– ఖైరతాబాద్, ఏప్రిల్ 24 :

## 6 నుంచి బీసీఏ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీసీఏ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీఏ రెండు, ఆరో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెలా ఆరవ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్సైట్ లో చూసుకోవాలని సూచించారు.


అన్నదానం: శ్రీ సత్యసాయిబాబా ఆరాధన మహోత్సవం సందర్భంగా ఖైరతాబాద్ బడా గణేశ్ వద్ద గురువారం నిర్వహించిన అన్నదానంలో బీఆర్‌ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్ రెడ్డి పాల్గొని అన్నం వడ్డించారు.– ఖైరతాబాద్

### నేటి నుంచి పీహెచ్‌డీ
## ప్రవేశ పరీక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని ఫ్యాకల్టీలలో పీహెచ్డీలలో ప్రవేశానికి నిర్వహిస్తున్న ప్రవేశ పరీక్షలను శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఈ పరీక్షలను మూడు రోజుల పాటు రోజూ మూడు సెషన్లలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ పరీక్షలకు మొత్తం 9,747 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. కంప్యూటర్ బేస్ట్ గా నిర్వహిస్తున్న ఈ పరీక్షకు కేంద్రాలను హైదరాబాద్ నగరంలోనే ఏర్పాటు చేశామని వివరించారు. అభ్యర్థులు తమ పరీక్షా కేంద్రానికి పరీక్ష ప్రారంభమయ్యే 90 నిమిషాల ముందుగానే చేరుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు తమ వెబ్సైట్ లో చూసుకోవాలని స్పష్టం చేశారు.

## పర్యాటకులపై కాల్పులు హేయమైన చర్య


హిమాయత్‌నగర్ వై జంక్షన్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు


మృతి చెందిన పర్యాటకులకు నివాళులర్పిస్తున్న ఆలయ కమిటీ

హిమాయత్ నగర్,ఏప్రిల్ 24: కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై టెర్రరిస్టులు చేసిన దాడులు అత్యంత హేయమైన ఘటన అని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు.దేశ సమగ్రతను కాపాడేందుకు కశ్మీర్ ప్రభుత్వం,కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం హిమాయత్‌నగర్ వై జంక్షన్‌లో నిరసన చేసి ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమాయక ప్రజలపై ఉగ్రవాదులు దాడి చేయడం పిరికిపంద చర్య అని ఈ ఘటనలో గాయపడిన,మృతి చెందిన పర్యాటకులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్యార క్రాంతి కుమార్,రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్,వంశీ,అన్వర్,హరీష్,అరుణ్,వెంకటేష్ పాల్గొన్నారు.

### ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సంతాపం

ఎర్రగడ్డ: జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరపడం అత్యంత హేయమైన చర్య అని బోరబండ హరిహర పుత్ర అయ్యప్పస్వామి ఆలయ కమిటీ పేర్కొన్నది. ఆ కాల్పుల్లో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ఆలయ ప్రాంగణంలో సంతాపాన్ని ప్రకటించారు. కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ ఘాతుకానికి పాల్పడ్డ ఉగ్ర ముఠాను కేంద్రం అదుపులోకి తీసుకుని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మణ్ గౌడుతో పాటు ఆలయ కమిటీకి చెందిన సత్యనారాయణ, తివారీ, సంజీవరెడ్డి, ధర్మరాజు, వినోద్, శ్రీనివాస్, మధు, శేఖర్, అప్పారావు, నర్సింగరావు, ప్రవీణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


అత్తాపూర్‌లో మౌన ర్యాలీ చేపడుతున్న ప్రజలు

### ఉగ్రదాడికి నిరసనగా మౌన ర్యాలీ, ప్రదర్శన

మైలార్‌దేవ్‌పల్లి: కశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తూ గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించారు. కశ్మర్ ఘటనకు నిరసనగా అత్తాపూర్ అంబియన్స్‌ఫోర్ట్ నుంచి కాలనీ వాసులు ర్యాలీ చేపట్టారు. దాడిలో మృతి చెందిన వారి ఆత్మశాంతి చేకూరాలని కోరుతూ ఇలాంటి ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మ్యాడం మధుసుధన్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

### అభివృద్ధి చెందుతున్న దేశంగా నిలవాలి

మణికొండ, ఏప్రిల్ 24: గండిపేటలోని మహాత్మాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సైన్స్, మానవీయ శాస్త్రాల విభాగం స్టార్టప్‌ల కోసం మేధో సంపత్తి హక్కులను, మేధో సంపత్తి నిర్వహణను రక్షించడంపై ఒక రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో కీలకమైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థలలో పేటెంట్లు, ట్రేడ్‌మార్క్‌లు, పారిశ్రామిక డిజైన్ల పరిణామంపై సీబీఐటీ నుంచి ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ సలహాదారుడు ప్రొఫెసర్ ఉమాకాంత్‌చౌదరి పాల్గొని ప్రసంగించారు. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్లు, ఆవిష్కరణ కేంద్రాలపై ఎక్కువగా దృష్టి పెట్టాలని సూచించారు.

పేటెంట్లు, ట్రేడ్‌మార్క్‌లు, పారిశ్రామిక డిజైన్ వంటి మూడు ప్రధాన ఐపీ వర్గాల్లో గణనీయమైన పురోగతి సాధిస్తూ, ప్రపంచ ఐపీ ల్యాండ్‌స్కేప్‌లో భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా నిలవాలని, దాని కోసం విద్యార్థులు కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కె.సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


ఎంజీఐటీలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రొఫెసర్ ఉమాకాంత్‌చౌదరి తదితరులు

## మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

ఖైరతాబాద్, ఏప్రిల్ 24 : మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రీదేవి కొడగంటి అన్నారు. గురువారం సాయంత్రం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్, అమర్ హాస్పిటల్స్ సంయుక్తాధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ శ్రీదేవి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మహిళల్లో వచ్చే ఆరోగ్య సమస్యలను వివరించారు. మహిళల్లో మెనోపాజ్ సమస్యలు వేధిస్తున్నాయని, అందుకు అనేక కారణాలుంటాయన్నారు. ఈస్ట్రోజన్ హార్మోన్లు తగ్గిపోవడం వల్ల నిద్రపట్టకపోవడం, మతిమరుపు లాంటి సమస్యలు వస్తాయన్నారు. విటమిన్ డీ తక్కువ ఉన్న వారిలో పిరియడ్లలో తేడాలు వస్తాయన్నారు. అంతేకాకుండా ఫైబ్రాయిడ్స్, ఎండోమెట్రియాసిస్, యూరినరీ ట్రాక్ ఇన్‌ఫెక్షన్ లాంటి దీర్ఘకాలిక సమస్యలతో అనేక మంది బాధపడుతున్నారన్నారు. సరైన చికిత్సతో దానిని పరిష్కరించుకోవచ్చన్నారు. మహిళలు రొమ్ము, అండాశయ క్యాన్సర్ల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ప్రతి సంవత్సరం పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరోగ్యం కోసం కొంత సమయాన్ని కేటాయించాల్సిన అవసరం ఉందని, వైద్యుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షురాలు సి. వనజ, కార్యవర్గ సభ్యురాలు ఎ. పద్మావతి, జర్నలిస్టు రచన తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న మహిళా జర్నలిస్టులు

### యూనియన్
## సభ్యుడిపై దాడి

– జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ అధ్యక్షుడు స్వామిగౌడ్‌పై కేసు

బంజారాహిల్స్,ఏప్రిల్ 24: జూనియర్ ఆర్టిస్ట్‌పై అకారణంగా దాడిచేయడంతో పాటు బెదిరింపులకు పాల్పడిన జూనియర్ ఆర్టిస్ట్స్ యూనియన్ అధ్యక్షుడు స్వామిగౌడ్‌తో పాటు అతడి అనుచరులపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. రహ్మత్‌నగర్ సమీపంలోని యాదగిరి నగర్‌లో నివాసం ఉంటున్న పి.మల్లికార్జున్ అనే వ్యక్తి సినిమాల్లో జూనియర్ ఆర్టిస్ట్‌గా పనిచేస్తుంటాడు. బుధవారం ఉదయం బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 2లోని ఇందిరానగర్‌లో యూ నియన్ కార్యాలయం వద్దకు వచ్చిన మల్లికార్జున్ తనకు రావాల్సిన నాలుగు నెలల పేమెంట్ ఇవ్వాలంటూ జూనియర్ ఆర్టిస్ట్స్ యూనియన్ అధ్యక్షుడు స్వామి గౌడ్‌ను నిలదీశాడు. రెగ్యులర్‌గా పేమెంట్స్ ఇవ్వకపోవడంతో తనకు ఇబ్బందిగా ఉందంటూ గొడవకు దిగాడు. దీంతో మల్లికార్జున్‌పై స్వామిగౌడ్‌తో పాటు అతడి అనుచరులు దాడికి పాల్పడ్డారు. తనతో పెట్టుకుంటే జీవితంలో పని దొరక్కుండా చేస్తానని, కార్డు రద్దు చేయించడంతో పాటు మహిళల చేత కేసు పెట్టిస్తా అంటూ బెదిరింపులకు దిగారు. దీంతో తనపై దాడి చేసిన స్వామిగౌడ్‌తో పాటు అతడి అనుచరుల మీద చర్యలు తీసుకోవాలని గురువారం బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### బీ ఫార్మసీ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీ ఫార్మసీ కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీ ఫార్మసీ (పీసీఐ) మెయిన్, బ్యాక్ లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామ న్నారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను సంబంధిత కళాశాల నుంచి మూడు వారాల తర్వాత పొందవచ్చన్నారు. ఈ రివాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 28లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ. 200 అపరాధ రుసుముతో ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పరీక్ష జవాబు పత్రాల నకలు పొందగోరేందుకు ఒక్కో పేపర్ కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 28 వరకు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.